క్లుప్తంగా

పంటకోత ప్రయోగాలపై శిక్షణ



మాట్లాడుతున్న సీపీవో వీర్రాజు

వీరఘట్టం: స్థానిక ఆర్‌బీకేలో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్(సీపీవో) వీర్రాజు ఆధ్వర్యంలో వరి పంటకోత ప్రయోగాలపై విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు బుధవారం శిక్షణ ఇచ్చారు. పంటకోత ప్రయోగాల ద్వారా పంట దిగుబడిని అంచనా వేయవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జె.సౌజన్య, ఏఎస్‌వో చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేస్తున్న గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం: ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మండలానికి చెందిన పలువురు గిరిజనులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష బుధవారం చేపట్టారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న మాట్లాడుతూ భద్రగిరి ఏపీ టీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల(బాలురు) సమీపంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ అటవీ భూమిలో నిరుపేదలైన గిరిజనుల ఇళ్ల కోసం స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇల్లు



నేలమట్టమైన ఇల్లు

భామిని: మండలంలోని బాలేరు దళితవాడలో వృద్ధురాలు గొర్లె లక్ష్మి నివశిస్తున్న ఇల్లు బుధవారం కూలిపోయింది. ఇల్లు కూలినప్పుడు వృద్ధురాలు ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అప్పటికే శిథిలావస్థకు చేరుకున్న ఇల్లు గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బాగా నానిపోయి పడిపోయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. సర్పంచ్ జామి ప్రభాకర్, వీఆర్‌వో, సచివాలయ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని, జరిగిన ఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు.

వట్టిగెడ్డకు వరదపోటు



వట్టిగెడ్డలో ప్రవహిస్తున్న వరదనీరు

వీరఘట్టం: మండల కేంద్రం మీదుగా ప్రవహిస్తున్న వట్టిగెడ్డకు వరదపోటెత్తింది. గత కొన్ని రోజులుగా గెడ్డ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గెడ్డలో నీటిప్రవాహం పెరిగిందని, పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ అన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

కురుపాం: మండల కేంద్రంలోని దొనకవీధికి చెందిన దొనక సురేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న అతడి స్నేహితులంతా చందాలు వేసుకుని, పోగు చేసిన రూ.20 వేలను బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో నెల్లి శ్రీనివాసరావు, కర్రి సరళ, గుడ్ల గురునాథ్, గరుగుబిల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు తాగునీటి బోరు మంజూరు



బోర్ వెల్ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ గౌరీశంకరరావు

కురుపాం: మండలంలోని మొండెంఖల్ పంచాయతీ కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు తాగునీటి బోరు మంజూరైనట్లు సర్పంచ్ ఇంటికుప్పల గౌరీశంకరరావు బుధవారం తెలిపారు. రూ.90 వేల వ్యయంతో బోరు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం బోర్ వెల్ పనులు కొనసాగుతున్నాయన్నారు.

● ఆధార్ స్పెషల్ క్యాంప్



సీతంపేట మండలంలోని సోమగండి గ్రామ సచివాలయంలో ఆధార్ స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 25వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో ఆధార్ సేవలు ఉచితంగా అందజేస్తారు. కొత్తగా ఆధార్ కార్డు చేయించుకోవాలనుకునే వారు, ఆధార్‌లో మార్పులు, చేర్పులు కావాలనుకునే వారు సచివాలయంను సంప్రదించాలని అధికారులు కోరుతున్నారు. **–సీతంపేట**

● చంద్రయాన్-3 విజయవంతం



ప్రభుత్వ పాఠశాలల్లో చంద్రయాన్–3 ప్రయోగ ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులు వీక్షించారు. బుధవారం సాయంత్రం వీరఘట్టం మండలంలోని చిదిమి పాఠశాలలో 5:30 గంటల నుంచి 6:30 గంటల వరకు చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్ అయ్యే విధానాన్ని టీవీలో చూసి, విద్యార్థులు సంబరపడ్డారు. ప్రయోగం కూడా విజయవంతం కావడంతో యావత్తు భారతావని జయహో భారత్ అంటూ నినాదాలు చేసింది. ఇస్రో శాస్త్రవేత్తల కృషిని కూడా అభినందించారు. **–వీరఘట్టం**

● వర్షంతో ఉపశమనం



గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వర్షాకాలం వచ్చినా ఎండలు తగ్గకపోవడంతో ఉక్కపోతతో అలమటించిన ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది. ఖరీఫ్ సాగు చేస్తున్న రైతాంగం వర్షం కోసం కొన్నిరోజులుగా ఎదురుచూస్తుండగా, గంటకాలం పాటు ఏకధాటిగా కురిసిన వాన వ్యవసాయానికి పనికి వస్తుందని వారు సంతోషం వ్యక్తం చేస్తుండడం విశేషం. **–గుమ్మలక్ష్మీపురం**

టంగుటూరి సేవలు చిరస్మరణీయం

గుమ్మలక్ష్మీపురం: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు రాష్ట్రాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ కృష్ణప్రసాదరావు కొనియాడారు. బుధవారం స్థానిక జీసీఎంఎస్ కార్యాలయంలో టంగుటూరి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జీసీఎంఎస్ అధికారులు, ఉద్యోగులంతా కలిసి పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నతనంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్రానికి ప్రథమ ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని, దానివెనక ఆయన కృషి ఎంతో ఉందన్నారు. సైమన్ కమిషన్ భారత్‌కు వచ్చినప్పుడు మద్రాస్‌లో సైమన్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ దేశభక్తి చాటుకున్నారన్నారు. బ్రిటిషర్లకు ఎదురెళ్లి, దమ్ముంటే తనను కాల్చుకోమని దేశం కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ గొప్పవ్యక్తి టంగుటూరి అన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయం, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐటీడీఏలో జరిగిన కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. అనంతరం ఆయన దేశభక్తిని, ఆంధ్ర రాష్ట్రానికి ఆయన ప్రథమ ముఖ్యమంత్రిగా అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీడీ శ్రీనివాసరావు, ఏఎంవో కోటిబాబు, పీఏవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఎ.లిల్లీరాణి తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట: టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఐటీడీఏ ఏపీవో రోసిరెడ్డి



సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ ఈవో లిల్లీరాణి



గుమ్మలక్ష్మీపురం: జీసీఎంఎస్ కార్యాలయంలో టంగుటూరి జయంతి కార్యక్రమం

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

● ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి సూచించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమైన ఆమె గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న సచివాలయ, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ల ప్రభుత్వ భవన నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జగనన్న కాలనీ గృహ నిర్మాణాలు కూడా త్వరితగతిన పూర్తయ్యేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఇంజినీరింగ్, టూరిజం పనులు సకాలంలో పూర్తి కావాలని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, పీఆర్ ఈఈ రాధారాణి, డీఈ లోకనాథం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ డిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

పాఠశాలల్లోని డ్రాపౌట్స్‌పై ప్రవీణ్ ప్రకాష్ ఆరా

వీరఘట్టం: పాఠశాలల్లోని డ్రాపౌట్స్‌పై రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆరాతీశారు. బుధవారం వీరఘట్టం ఎంఈవోలు గౌరినాయుడు, ఆనందరావులకు వాట్సాప్ కాల్ చేసి, మాట్లాడిన ఆయన మండలంలో 575 మంది పిల్లలు బడి బయట ఉన్నట్లు రాష్ట్ర విద్యాశాఖ వచ్చిన సమాచారంపై ఆరాతీశారు. అయితే వారిలో 335 మంది వివిధ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్నట్లు గుర్తించినట్లు ఎంఈవోలు పేర్కొన్నారు. మరో 22 మంది టెన్త్, ఇంటర్మీడియట్‌లో ఫెయిలైన వారిగా, 8 మందికి వివాహాలు జరిగినట్లు, 41 మంది వలస వెళ్లినట్లు, ఆరుగురు చనిపోయినట్లు గుర్తించామన్నారు. 34 మంది డ్రాపౌట్స్‌గా గుర్తించామని, 13 మంది వివరాలు తెలియరాలేదన్నారు. మొత్తం 470 మంది వివరాలు సేకరించామని, ఇంకా 105 మంది వివరాలు సేకరిస్తున్నామని ఎంఈవోలు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎంఈవోలు గౌరినాయుడు, ఆనందరావు

పేదల గుండెచప్పుడు గద్దర్

పాలకొండ రూరల్: పేదల గుండెచప్పుడు గద్దర్ అని వక్తలు కొనియాడారు. బుధవారం స్థానిక పట్టణంలో ఏర్పాటు చేసిన గద్దర్ సంస్మరణ సభకు హాజరైన పలు ప్రజాసంఘాల నాయకులు, బహుజన, దళిత నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు ప్రజాగాయకుడు గద్దర్ తన పాటల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేసిన విధానాన్ని వివరించారు. గద్దర్ తన జీవితాన్ని ప్రజల కోసం అర్పించారని, సమాజంలో పేరుకుపోయిన రుగ్మతలను తన గళంతో కడిగిపారేసారన్నారు. అంతకుముందు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నేత ఎస్.భరత్‌భూషణ్ రాజు, కె.వేణు, బహుజన సమాజ్ వాదీ పార్టీ నాయకుడు బి.బుద్ధుడు, పార్వతీపురం మన్యం జిల్లా కార్మిక సంఘ నాయకుడు డి.రమణరావు, దళిత సంఘ నాయకుడు బి.మోహన్‌రావు, బి.సుధాకర్, జి.రవికుమార్, పి.రమేష్, జానపద గేయకారుడు ఉదయం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఓటరుగా నమోదు కావాలి

భామిని: 18 ఏళ్ల వయసు నిండిన యువతీయువకులంతా ఓటర్లుగా నమోదు కావాలని తహసీల్దార్ నీలాపు అప్పారావు ఓ ప్రకటనలో బుధవారం కోరారు. ప్రత్యేక సమ్మరీ రివిజన్ సమయంలో గానీ ఓటర్ల జాబితా నిరంతర నవీకరణ సమయంలో గానీ ఫారం–6ను సమర్పించి, ఓటు హక్కు పొందాలని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు సర్వేకు వస్తున్న బీఎల్‌వోలను కూడా సంప్రదించి, ఓటరుగా నమోదు కావచ్చన్నారు.

రూ.33 లక్షలతో రక్షిత మంచినీటి పథకం నిర్మాణం

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి గ్రామ సమీపంలో రూ.33 లక్షల వ్యయంతో రక్షిత మంచినీటి పథకం నిర్మాణానికి చర్యలు ప్రారంభమయ్యాయి. దాదాపు 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంక్‌ను నిర్మించనున్నారు. ఇన్నాళ్లు గ్రామస్తులు తాగునీటి బోర్లు, బావుల మీదనే తాగునీటి కోసం ఆధారపడేవారు. ఇప్పుడు రక్షిత మంచినీటి పథకం నిర్మాణం జరుగుతుండడంతో ప్రభుత్వంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెన్షన్ దరఖాస్తుల పరిశీలన

భామిని: మండలంలోని ఘనసర, బాలేరు, పెద్దదిమిలి గ్రామ సచివాలయాల పరిధిలో రీ–వెరిఫికేషన్‌కు వచ్చిన పెన్షన్ దరఖాస్తులను ఎంపీడీవో జి.చంద్రరావు, ఈవోఆర్‌డీ జి.కృష్ణారావు బుధవారం పరిశీలించారు. మొత్తం 96 మంది దరఖాస్తులు పునఃపరిశీలనకు వచ్చాయని వారు పేర్కొన్నారు. అర్హులకు తప్పనిసరిగా పెన్షన్‌లు మంజూరయ్యేలా చూస్తామన్నారు.

కలుపుమొక్కల నివారణపై అవగాహన

సీతంపేట: స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానంలో కలుపుమొక్కల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. సీనియర్ సైంటిస్ట్ సీతారాం ఆధ్వర్యంలో అక్కడి పార్థీవం కలుపు మొక్కలు తీసి, కలుపు మొక్కలు ఎలా తీయాలన్న దానిని రైతులకు వివరించారు. సైంటిస్ట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా వారోత్సవాలు



గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం లిల్లీరాణి తదితరులు

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల(బాలికలు)లో తెలుగు భాషా వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం తెలుగు వాడుక భాషా పితామహుడు గిడుగు వేంకటరామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన ఆధునిక తెలుగు భాష నిర్మాతగా వెలుగొందిన తీరును వక్తలు కొనియాడారు. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని, ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న మాధుర్యాన్ని చాటిచెప్పిన మహనీయుడు గిడుగు వేంకటరామ్మూర్తి పంతులన్నారు. ఈ నెల 29వ తేదీన ఆయన జయంతి సందర్భంగా ఏటా తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ.లిల్లీరాణి, హెచ్‌డబ్ల్యూవో పి.అమల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

జయహో భారత్.. హ్యాట్సాఫ్ ఇస్రో..

వీరఘట్టం: చంద్రయాన్–3 విక్రమ్ ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్ విజయవంతంపై ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఓ ప్రకటన ద్వారా తన సందేశం వినిపించారు. ఇది చారిత్రాత్మక విజయమని, జయహో భారత్.. హ్యాట్సాఫ్ ఇస్రో అని నినదిస్తూ కొన్ని దశాబ్దాల భారత్ కల ఇప్పుడు నెరవేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. చంద్రుని దక్షిణ ధ్రువంపై తొలిసారిగా అడుగుపెట్టిన ఘనత భారత్‌కు దక్కడం యావత్ భారతావనికే గర్వకారణమన్నారు. ఇలాంటి మరెన్నో విజయాలు భవిష్యత్‌లో సాధించాలని ఆకాంక్షించారు. ప్రపంచం చూపు భారత్ వైపు తిప్పిన శాస్త్రవేత్తలను తన అభినందనలన్నారు.



ఎమ్మెల్యే కళావతి

రైతులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి

● జిల్లా రైతు శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: రైతులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్ది, తద్వారా పంట సాగు ఖర్చును తగ్గించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే రైతు శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా రైతు శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ) శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని బీజేపురం గ్రామ రైతు భరోసా కేంద్రంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంతో పాటు రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నూతన సాగు విధానాలు, మెలకువలు నేర్పించాలని తెలిపారు. అలాగే పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్ల నివారణకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. రైతులకు ఎప్పుడూ ఆర్‌బీకే సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో తిలక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాసరావు

తాగునీటి అవస్థలు లేకుండా చూడాలి

పాలకొండ రూరల్: స్థానిక పట్టణంలోని ప్రజలకు తాగునీటి అవస్థలు లేకుండా చూడాలని నగరపంచాయతీ కమిషనర్ ఎస్.సోమేశ్వరరావు సూచించారు. బుధవారం స్థానిక పట్టణంలోని వీవర్స్ కాలనీ సమీపంలోని రక్షిత మంచినీటి పథకానికి నాగావళి నది నుంచి నీటిని తీసుకువచ్చే మోటార్లు మరమ్మతులు కాగా, వాటిని ఆయన పరిశీలించారు. వీలైనంత త్వరగా మోటార్లు బాగుచేసి, తాగునీటి సరఫరా పునరుద్ధరణ జరిగేలా చర్యలు తీసుకోవాల్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలన్నారు.



రక్షిత మంచినీటి పథకంను పరిశీలిస్తున్న నగర పంచాయతీ కమిషనర్ సోమేశ్వరరావు

సీనియార్టీ ప్రకారం డ్యూటీలు వేయాలి

పాలకొండ రూరల్: ఆర్టీసీలో ఉద్యోగుల సీనియార్టీ ప్రకారం డ్యూటీలు వేయాలని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కార్యదర్శి బి.కె.మూర్తి డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక ఆర్టీసీ డిపో వద్ద బుధవారం నిరసన చేపట్టారు. అనంతరం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఆరోగ్యపరమైన సమస్యలతో సెలవు పెట్టినప్పుడు జీతాల కోత పెట్టడం సరికాదన్నారు. ఇటీవల ఇచ్చిన చార్జిషీట్ పనిష్మెంట్లు రద్దు చేయాలన్నారు. యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. గ్యారేజీలో చార్జులు వేయాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమాల్లో జిల్లా నాయకులు డి.దుర్గారావు, డిపో, గ్యారేజీల అధ్యక్ష, కార్యదర్శులు సాగర్, రమణ పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపో వద్ద నినాదాలు చేస్తున్న ఈయూ నాయకులు, ఉద్యోగులు

పోలీసులు ప్రజాసేవకులు

భామిని: పోలీసులు ప్రజాసేవలకులని, పోలీసులంటే భయపడకూడదని, వారిని స్నేహితులుగా చూడాలని ఎస్‌ఐ యతిరాజుల అమ్మనరావు అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థానిక ఏపీ మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసుల విధులు, బాధ్యతలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. నిత్యం శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవడమే పోలీసులే ప్రథమ విధి అన్నారు. యువత, విద్యార్థులు ఖైనీ, గుట్కా, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. దిశ యాప్‌ను ప్రతిఒక్కరూ స్మార్ట్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని, రక్షణ పొందాలన్నారు. భామిని మహిళా పోలీస్ చందన్ పట్నాయక్ పాల్గొన్నారు.



జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ఎస్‌ఐ అమ్మనరావు

శరవేగంగా భూముల రీసర్వే

పాలకొండ రూరల్: పట్టణ పరిధిలో చేపట్టిన భూముల రీసర్వే శరవేగంగా జరుగుతోందని, త్వరలోనే పూర్తి స్థాయిలో సర్వే పూర్తవుతుందని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక పాలకొండ–వీరఘట్టం రోడ్డు ప్రాంతంలో జరుగుతున్న సర్వేను పరిశీలించిన ఆయన సర్వేను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. రైతుల సమక్షంలోనే సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు వంటివి చేపట్టాలని తెలిపారు.



సర్వేను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకువెళ్లండి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఆయాలు, సీఐటీయూ నాయకులు

పాలకొండ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలుగా పనిచేస్తున్న వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఆయాల సంఘ అధ్యక్షురాలు బి.చిన్నమ్మడు కోరారు. ఇదే విషయమై ఆమె సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో ఎంఈవో సోంబాబును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతినెలా సకాలంలో జీతాలు చెల్లించేలా చూడాలని, యూనిఫాం అందజేయాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు డి.రమణారావు, కె.రాము, పి.జ్యోతి పాల్గొన్నారు.